క్లుప్తంగా

ఘనంగా ద్వాదశి పూజలు



రావి,వేప వృక్షాలున్నచోట పూజలు చేస్తున్న భక్తులు

సీతానగరం: కార్తీకమాసం పర్వదినాల్లో భాగంగా కార్తీక శుద్ధ ద్వాదశి రోజున ఆలయాల ప్రాంగణాల్లో ఉన్న రావి, వేప అనుసంధానంగా ఉన్న వృక్షానికి మహిళా భక్తులు జ్యోతులు వెలిగించి సూర్యనమస్కారాలు చేశారు. ఏకాదశి నుంచి ద్వాదశి రోజు ఉదయం వరకు రావి, వేప చెట్లున్న గ్రామాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సీతానగరం, లచ్చయ్యపేట, బూర్జ, నిడగల్లు, గుచ్చిమి, చిన భోగిలి గ్రామాలలో ఉన్న వృక్షాలవద్ద భక్తులు పూజా సామగ్రితో వచ్చిన భక్తులతో అర్చకులు పూజలు చేయించారు.

13 మద్యం బాటిల్స్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్‌తో సీఐ పద్మావతి

సీతానగరం: మండలంలోని పణుకుపేట గ్రామంలో దాడులు చేసిన సమయంలో ఒక బెల్ట్ షాపులో 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశామని సీఐ పద్మావతి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడులను నిర్వహించి మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

గంజాయి, సారాపై ఉక్కుపాదం మోపాలి

• ఎస్పీ మాధవరెడ్డి

పాచిపెంట: గంజాయి, సారాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు పాచిపెంట పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పి.కోనవలస చెక్‌పోస్టును సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న తనిఖీలపై ఆరా తీశారు. ఆయన వెంట సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్ అంకితా సురానా, సీఐ రామకృష్ణ, ఎస్సై తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె నోటీసులు అందజేస్తున్న 108 సిబ్బంది

పార్వతీపురంటౌన్: 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ నాయకుడు అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయ పార్వతికి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 వ్యవస్థలో నిర్వహణ సంస్థలను మార్పు చేసే ప్రతిసారి ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే నవంబర్ 25 నుంచి సమ్మెకు వెళ్తామని నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో 108 సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు, ఏఎన్ఎంలు

పార్వతీపురంటౌన్: ఆశ వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు సమస్యలు పరిష్కరించాలని ఐద్వా నాయకురాలు ఇందిర డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఎంహెచ్ఓ విజయ పార్వతికి ఆశ వర్కర్ల యూనియన్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ వర్కర్లకు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పనిభారం తగ్గించాలని కోరారు. కొత్త మొబైల్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇన్సూరెన్స్ వంటి ఖర్చులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

లాభదాయంగా ఆయిల్‌పామ్ సాగు

వీరఘట్టం: ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్ పామ్ సాగు లాభదాయంగా ఉంటుందని హార్టికల్చరల్ అధికారి అమరేశ్వరి సూచించారు. మండలంలోని కంబరవలసలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. రైతులకు నాణ్యమైన ఆయిల్‌పామ్ మొక్కలను సబ్సిడీపై అందిస్తామని శ్రీనివాస ఆయిల్‌పామ్ కంపెనీ మేనేజర్ సూచించారు.

కొత్తసీసాలో.. పాతసారా..!

• రూ.99కే మద్యం ఉత్తమాటే
• దుకాణాల్లో కనిపించని సి-బ్రాండ్
• జోరుగా బెల్టుషాపుల నిర్వహణ



పాత బీరు సీసాలే విక్రయిస్తున్నారని చూపిస్తున్న మందుబాబు

బలిజిపేట: మద్యం ధరలు తగ్గిస్తాం. నాణ్యమైన మద్యం బ్రాండ్లు అందుబాటులోకి తెస్తాం. క్వార్టర్ మద్యం రూ.99కే విక్రయిస్తాం. సి-బ్రాండ్ అందుబాటులో ఉంచుతాం. నాణ్యమైన మద్యం, తక్కువ ధరకే విక్రయం అని ఊదరగొట్టారు తప్ప ఆచరణలో అవేవీ కానరావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. షాపుల వద్దకు మందుబాబులు వెళ్లి మద్యం కొనుగోలు చేయగా వారికి కొత్త సీసాల్లో పాత మద్యమే ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత నెల లేబుల్‌తో ఉండే మద్యం సీసాలు షాపుల్లో కనిపిస్తున్నాయి. దానిలో పాత మద్యమే ఉందని ఇది కొత్తసీసాలో పాత సారా అన్న చందంగా కనిపిస్తోందని చెబుతున్నారు. గత నెల 16వ తేదీన కొత్త ప్రభుత్వంలో మద్యం పాలసీ ప్రకారం ప్రైవేట్ యాజమాన్యాల ఆధ్వర్యంలో కొత్త షాపులు ప్రారంభం అవడంతో మందుబాబులు చిందులేశారు. రూ.99కే మద్యం సీసాలను కొనుగోలు చేసి ఆనందాన్ని ఆస్వాదిద్దామనే సంకల్పంతో షాపుల వద్ద బారులు తీయగా పాత మద్యంసీసాలు, పాత బ్రాండ్లు కనిపించడంతో కాసింత నిరాశకు లోనయ్యారు. అది ఆరోజేకాదు ఈ రోజుకూ అదే పద్ధతి అని మండిపడుతున్నారు. మద్యం షాపుల్లో విక్రయించే సీసాలపై లేబుల్స్ గతనెలవి కనిపిస్తున్నా దానిలో మద్యం మాత్రం పాతదేనని మందుబాబులు వాపోతున్నారు. పాత ధరలకే కొనుగోలు చేస్తున్నామన్నారు.

• ఇష్టానుసారం బెల్టు షాపుల ఏర్పాటు

ఈ షాపుల సంగతి ఇలా ఉంటే గ్రామాల్లో బెల్టు షాపులు విపరీతంగా దర్శనమిస్తున్నాయి. గతంలో చాటుమాటుగా బెల్టుషాపుల్లో విక్రయాలు ఉండేవి. ఇప్పుడు అంతా మాచేతుల్లోకి వచ్చింది. మాకు అడ్డేంటనే విధంగా బెల్టుషాపులు ఎక్కువగా నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్లాసిక్, సిల్వర్, ఓసీ, ఐబీ, ఎంసీ విస్కీలు వంటి పాత బ్రాండ్లకు సంబంధించే మద్యం సీసాలు వస్తున్నాయని పాతధరలకే విక్రయిస్తున్నారని ఆగ్రహిస్తున్నారు. బ్లాక్‌బస్టర్, కేఫ్‌స్టార్మ్ వంటి బీర్లు రూ.220కు విక్రయిస్తున్నారని మందుబాబులు చెబుతున్నారు. సుమారు 60రకాల బ్రాండ్లు పాతవే షాపుల్లో ఉంటున్నట్లు సమాచారం. రూ.99ల విలువ గల మద్యంలో 5రకాల బ్రాండ్లు ఉన్నా అవి ఎక్కడా కనిపించకపోవడంతో మందుబాబులను నిరాశపరిచినట్లుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. తక్కువ రకాలవి బెల్టుషాపులకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. బలిజిపేట మండలంలో ఏర్పాటు చేసిన 5షాపులకు ఈనెల 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఐఎంఎల్ రకం 1,387సీసాలు, బీరు 180సీసాలు మాత్రమే వచ్చాయి. వాటితోపాటు వివిధ రకాల బ్రాండ్ల మద్యం వచ్చింది. 5షాపులకు కలిపి ఈతేదీల మధ్య రూ.2,59,42,236ల విలువైన సరుకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన తక్కువ ధర మద్యం, నాణ్యమైన మందు వచ్చిన దాఖలాలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



షాపుల్లో ఉన్న మద్యం

• బెల్టు షాపు నిర్వాహకులపై కేసులు

బలిజిపేట మండలంలో కొత్త విధానం వచ్చిన తరువాత తుమరాడ, పెద్దింపేట, మిర్తివలస, బర్లి గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై దాడులు చేసి ఏడుగురిపై కేసులు నమోదుచేసినట్లు సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ హౌస్ అధికారిణి పద్మ తెలిపారు. మొత్తం మీద అంతా బూటకంలా కనిపిస్తోందని మందుబాబులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఉమ్మడి జిల్లా డిపో మేనేజర్‌ను వివరణ కోరగా డిపో పరిధిలో ఉన్న 177మద్యంషాపులకు వచ్చిన సరుకును సరఫరా చేస్తున్నామన్నారు. రూ.99విలువైన మద్యం సీసాలు సరఫరా చేస్తున్నామని తెలిపారు.



పాత మద్యంతో ఉన్న సీసాలు

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో దోమల నివారణకు కాలువల్లో పూడిక తీత, పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమరావు చెప్పారు. ఈ మేరకు గెడ్డలుప్పి, బళ్లకృష్ణాపురం, బగ్గందొరవలస, చినభోగిలి గ్రామాల్లో జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్పపీడన ద్రోణి కారణంగా వర్షాలు కురిసే అవకాశముున్నందున గ్రామాల్లో దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచనలు ఇవ్వడంతో పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించడంతో పాటు కాలువల్లో మురుగునీరు మళ్లించడానికి పూడికలు తీయిస్తున్నట్లు తెలియజేశారు. ఆయా గ్రామాల్లో తీయించిన పూడికలను దూరప్రాంతాలకు తరలించనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో బళ్లకృష్ణాపురంలో సర్పంచ్ బళ్ల జగన్నాథం పర్యవేక్షణలో బగ్గందొర వలస సచివాలయ కార్యదర్శి శ్రీనివాసరావు, బళ్లకృష్ణాపురం పంచాయతీ కార్యదర్శి సౌజన్య కూలీలతో చెత్తకుప్పలను తొలగించే పనులు చేయిస్తున్నారని తెలియజేశారు. చేసిన పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ పవన్‌కుమార్ పరిశీలించారని చెప్పారు.



బళ్లకృష్ణాపురంలో పూడికలు తీయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

పాచిపెంట: మండలంలోని మూలవలస గ్రామం పరిధిలో బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రామారావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ, సిబ్బందితో కలిసి మూలవలస గ్రామ పరిధిలో దాడులు చేసి 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామని పేర్కొన్నారు.ఈ దాడులు మరింత విస్తృతం చేస్తామన్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం: గరుగుబిల్లి మండలంలోని చిన గుడబ, పెదగుడబ రెవెన్యూ పరిధిలో ఉన్న ఆత్యం మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న అక్రమమైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఆత్యం మైనింగ్ సంస్థ నిర్వహిస్తున్న క్వారీయింగ్‌ను రైతులతో వెళ్లి సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటపల్లి ప్రధాన కాలువ గట్టుపై భారీ వాహనాల రాకపోకల కారణంగా గట్టు బలహీనం కావడంతో పాటు వాహనాలపై నుంచి పెద్దపెద్ద రాళ్లు కాలువలో పడిపోవడంతో సాగునీటి సరఫరాకు ఆటంకంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. మైనింగ్ యాజమాన్యం జంఝావతి కాలువపై అనుమతులు లేకుండా బ్రిడ్జిలను నిర్మించడంతో భారీవాహనాల రాకపోకల కారణంగా గట్లు బలహీనపడుతున్నాయని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. క్వారీని ఆనుకుని ఉన్న చెరువుల ఆక్రమణపై ఈనెల 20న రైతులతో కలిసివెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఈ పరిశీలనలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవన్, రైతు సంఘం నాయకులు బుడితి అప్పలనాయుడు, గరుగుబిల్లి సూరయ్య, ఆయాగ్రామాల రైతులు చంద్రశేఖర్, ధనుంజయ తదితరులు ఉన్నారు.

రహదారి ప్రమాదాలను నివారిద్దాం

• జాయింట్ కలెక్టర్ శోభిక

పార్వతీపురం: అప్రమత్తంగా ఉంటూ రహదారి ప్రమాదాలను నివారిద్దామని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె కలెక్టరేట్ వద్ద యువజన సర్వీసులు, రవాణాశాఖ సంయుక్తంగా ఏర్పాటుచేసిన అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబాలను గుర్తుంచుకుని వాహనాలను నడపితే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని హితవు పలికారు. కుటుంబ యజమానికి ప్రమాదవశాత్తు ఏం జరిగినా కుటుంబం ఛిన్నాభిన్నమవుతుందన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలని సూచించారు. రహదారి నియమాలు పాటిస్తూనే గ్రామాల మధ్య, మలుపులు, గుట్టలు ఎక్కే సమయంలో నెమ్మదిగా వెళ్లాలని పేర్కొన్నారు. రహదారి ప్రమాదాలపై అవగాహనకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో 14వ తేదీవరకు జిల్లాలోని సాలూరు, పాలకొండ, పార్వతీపురం, కురుపాం శాసనసభ నియోజకవర్గాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ అధికారి బి.రామగోపాల్, ఇన్‌చార్జ్ జిల్లా రవాణాధికారి ఎం.శశికుమార్, నీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వేణుగోపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ శోభిక తదితరులు

అందరి సహకారంతో స్వచ్ఛ సుందర పార్వతీపురం

• వ్యక్తిగత పరిశుభ్రతతోనే మార్పు సాధ్యం
• అవగాహన సదస్సులో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్:

పట్టణంలోని ప్రతి ఒక్కరి సహకారంతో స్వచ్ఛ సుందర పార్వతీపురం కల సాకారం అవుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతతోనే మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మృత్యుంజయ ఆడిటోరియంలో స్వచ్ఛ సుందర పార్వతీపురంపై అవగాహన సదస్సు కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు జిల్లాలో ఎక్కువగా ప్రబలుతున్నాయని, ఇందుకు పారిశుద్ధ్య లోపమే కారణమన్నారు. తద్వారా దోమలు పెరిగేందుకు అవకాశం ఉందని చెప్పారు. వాటి నిర్మూలనకు పారిశుద్ధ్య మాసోత్సవాలతో పాటు అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వంతో పాటు ప్రజలు సహకరిస్తేనే స్వచ్ఛ సుందరంగా పట్టణం మారగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

జట్టు సేవలు భేష్

స్వచ్ఛ సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో జట్టు ఆశ్రమం అందిస్తున్న సేవలు తమ భావాలకు అనుగుణంగా ఉన్నాయని కలెక్టర్ సంతోషం వెలిబుచ్చారు. జట్టుతో పాటు లయన్స్, రోటరీ, సత్యసాయి, ఇతర స్వచ్ఛంద సంస్థలు చాలా జిల్లాలో ఉన్నాయన్నారు. నిబద్ధతతో పనిచేసే అధికారులు, స్వచ్ఛ ప్రేమికులు కూడా ఉన్నారని, వారందరి సహకారం, భాగస్వామ్యంతో స్వచ్ఛ సుందర పార్వతీపురం కలను నిజం చేయవచ్చని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. సదస్సులో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ స్వచ్ఛ సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ తీవ్ర కృషి చేస్తున్నారని, అందులో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. స్వచ్ఛత దిశగా స్వచ్ఛంద్ర కార్పొరేషన్ సహకరిస్తుందని, దీనిలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

జట్టు ఆశ్రమం వ్యవస్థాపకురాలు వెలిగొండ్ల పద్మజమ్మ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు ఈ వారసత్వాన్ని ఇవ్వకుండా స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేసి, స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగస్వాములు అవుదామని పిలుపునిచ్చారు. సదస్సులో జిల్లా అధికారులు, ఎన్‌జీఓలు, వివిధ సంస్థలు, సంఘాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి ఇంకుడుగుంతల నిర్మాణం

సీతానగరం: నేలలో వర్షం నీరు ఇంకేలా చేయడానికి, భూగర్భంలో నీరునిల్వ ఉండేందుకు తీస్తున్న ఇంకుడుగుంతల పనులు నిబంధనలకు లోబడి ఉండాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో వేతనదారుల ద్వారా పెదభోగిలి మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో చేపట్టిన ఇంకుడుగుంతల పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అన్నిగ్రామాల్లో ఇళ్లముందు లేదా ఇంటివెనుక ఖాళీ స్థలాల్లో వృథానీరు నేలలో ఇంకేలా చేసేందుకు ఇంకుడుగుంతల నిర్మాణం జరుగుతోందని తెలియజేశారు. ఇంటింటి కుళాయిల నుంచి వృథాగా బయటకు పోతున్న నీరు ఇంకుడు గుంతల్లో చేరే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. అన్ని గ్రామాల్లోని, ప్రభుత్వరంగ కార్యాలయాల్లో ఇంకుడుగుంతలను తీయించాలని ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో టెక్నికల్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



ఇంకుడుగుంతలను పరిశీలిస్తున్న ఏపీఓ భాను

పనిచేయని ఆధార్ కేంద్రాలు

• ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సీతానగరం: ఎక్కడ ఎటువంటి అత్యవసర పరిస్థితులు వచ్చినా, బ్యాంకుల్లో దాచుకున్న నగదు పొందాలన్నా ఆధార్ కార్డు నంబర్ లేనిదే పని జరగదని ఆయాసంస్థల ప్రతినిధులు చెప్పడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఆధార్ కార్డులేనిదే ఏపనీ జరగదని ప్రభుత్వానికి తెలిసినా గతప్రభుత్వం సచివాలయాల్లో ఏర్పాటు చేసిన సిబ్బంది ఉన్నా ఆధార్ నంబర్లు ఫీడ్ చేయాలిస్న యంత్రాలు పనిచేయకపోవడంతో కాళ్లరిగేలా తిరుగుతున్నా సమాధానం చెప్పడానికి మనుషులు కరువయ్యారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల సౌలభ్యం కోసం బూర్జ, దయానిధిపురం, అంటిపేట, జోగింపేట, సీతానగరం గ్రామాల్లో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసి డిజిటల్ సహాయ కులను ప్రభుత్వం నియమించింది. నాలుగు నెలలుగా ఆధార్ కేంద్రాలు పని చేయడం లేదని, మండలానికి పర్యటనకు వచ్చిన సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ దృష్టికి తీసుకువెళ్లిన సమయంలో రెండురోజుల్లో ఆధార్ కేంద్రాలు వినియోగంలోకి వస్తాయని గుచ్చిమి, సూరంపేట ప్రజలకు హామీ ఇచ్చారు. సబ్‌కలెక్టర్ వచ్చి వారంరోజులు గడుస్తున్నా ఐఏఎస్ అధికారి ఇచ్చిన మాటను పట్టించుకోవడం లేదని ఇంకెవరికి ఫిర్యాదు చేస్తే పనిఅవుతుందోనని బాధితులు ఎం.సత్యానారాయణ, కె. శ్రీనివాసరావు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్దేశించిన ఆదార్ కేంద్రాల్లో నంబర్ మార్పులు చేర్పులు, సవరణలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అంటిపేటలో మూతపడిన ఆధార్ కేంద్రం

సైబర్ నేరాలు-రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



పణుకుపేట కూడలిలో మాట్లాడుతున్న ఎస్సై ఎం రాజేష్

సీతానగరం: గ్రామ, పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న సైబర్ నేరాల నివారణకు పోలీస్‌శాఖ చేస్తున్న కృషికి ప్రజలు తమవంతు సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. ఈ మేరకు బుధవారం సీతానగరం మండలంలోని పణుకుపేట జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేసి సైబర్‌నేరాల నివారణకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు అక్కడక్కడ జరుగుతున్నాయని, ఆయానేరాలను అదుపు చేయడానికి ప్రజలు 1930నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. అనుభవం లేకుండా కార్లు, మోటార్ వాహనాలపై డ్రైవింగ్ చేయడం, మద్యం తాగి అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు, సీట్‌బెల్ట్‌లేకుండా కార్లు రోడ్డుపై నడుపుతున్న సమయంలో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. కార్లు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తులు సీట్‌బెల్ట్, ద్విచక్రవాహనాలపై ప్రయాణం చేస్తున్న వ్యక్తులు విధిగా హెల్మెట్ ధరించాలని, ఆటో నడుపుతున్న వారు నిర్దేశిత ప్రయాణికులతో వాహనాలు నడపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వర్గానికి ఉపయోగం లేని బడ్జెట్

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో కార్మిక వర్గానికి ఎటువంటి ఉపయోగం లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథ రావు అన్నారు. ఈ మేరకు బుధవారం సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెట్టిన బడ్జెట్‌లో వేతనాలు, కార్మిక సామాజిక భద్రత ప్రస్తావనే లేదన్నారు. మన్యం జిల్లాలో అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం స్కీం వర్కర్లకు డీఏ సౌకర్యం లేనందు వల్ల ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వేతనం పెంచవలసి ఉందన్నారు. ఐదు సంవత్సరాలైనా వారి జీతాలు పెంచడం కోసం బడ్జెట్‌లో ఎటువంటి ప్రయత్నం చేయలేదంటూ అసంతృప్తి వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కోశాధికారి గొర్లె వెంకటరమణ, శ్రామిక మహిళా సంఘం నాయకురాలు వి.ఇందిర, బి.సూరిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు మన్మథ రావు

నేటి నుంచి సహకార వారోత్సవాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని పీఏసీఏస్‌లో ఈ నెల 14 నుంచి 20 వరకు 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ సీఈఓ ఎస్. గుంపస్వామి బుధవారం తెలిపారు. గురువారం సహకారశాఖ ద్వారా అమలవుతు న్న కార్యక్రమాల వివరాలు వెల్లడించడం, 15న నూతన ఆవిష్కరణలు, 16న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, సహకార సంఘాల పాత్ర, 17న సహకార సంస్థల వ్యాపార ప్రాయోజిత సంస్థలుగా రూపాంతరం, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెపొందించడం, 19న మహిళలు, యువత, బలహీన వర్గాలకు సహకారం పెంపొందించడం, 20న సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.